చంద్రబాబు అహంకారి

- ఓర్వలేకే ఇష్టారాజ్యంగా మాటలు
- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్
- చంద్రబాబు మాటలకు వ్యతిరేకంగా భారీ బైక్ ర్యాలీ



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



బైక్ ర్యాలీలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

దాబాగార్డెన్స్: పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఇచ్చే సెంటు భూమిపై తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అహంకారపూరితంగా మాట్లాడడం ఆయన మానసిక పరిస్థితికి అద్దంపడుతోందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ దుయ్యబట్టారు. నీ పాలనలో పేదలకు సెంటు భూమి ఇచ్చిందీ లేదు.. మేలు చేసిందీ లేదు.. నిరంతరం పేదల సంక్షేమానికై కట్టుబడి పనిచేస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డిపై అవాకులు, చవాకులు పేలుతావా? నీవు ఏనాడైనా పేదలకు భూమిచ్చావా? ఇళ్లు ఇచ్చావా?‌‌ అంటూ మండిపడ్డారు. చంద్రబాబు మానసిక పరిస్థితి బాగోలేదని... అందుకే ఇలాంటి మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలను కించపరిచేలా... వారి ఇళ్ల కోసం ఇచ్చే సెంటుభూమి శవం పూడ్చడానికి సరిపోతుందంటూ చంద్రబాబు చేసిన అప్రజాస్వామిక, అహంకారపూరిత వ్యాఖ్యలను ఖండిస్తూ నియోజకవర్గంలో సోమవారం పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ చేపట్టి నల్ల జెండాలతో నిరసన చేపట్టారు. ఎమ్మెల్యే వాసుపల్లితోపాటు మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, మత్స్యకార డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ, పార్టీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్, పలువురు కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులతో కలిసి చేపట్టిన బైక్ ర్యాలీ జగదాంబ జంక్షన్ సమీపాన గల మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం నుంచి ప్రారంభమై లేపాక్షి జంక్షన్, టర్నర్ చౌల్ట్రీ, పూర్ణామార్కెట్ మెయిన్ రోడ్డు, టౌన్‌కొత్తరోడ్డు, రీడింగ్ రూమ్, కురుపాం మార్కెట్ మీదుగా వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ రాణిబొమ్మ వరకు సాగింది. ర్యాలీలో వందలాది బైక్‌లతో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అందరి చూపూ ఆంధ్రప్రదేశ్ వైపే...

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి మట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దేశంలోనే ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తుండడంపై అందరూ ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలు మాత్రం ఓర్వలేకపోతున్నాయని ఎద్దేవా చేశారు. 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇస్తే ఓర్వలేకపోతున్నారన్నారు. చంద్రబాబుకి వయసు పైబడిందని వదిలేస్తే అహంకారపూరితంగా మాట్లాడుతున్నారన్నారు. అంబేద్కర్ ఆశయ సాధనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఎల్లో మీడియాతోపాటు ప్రతిపక్ష నాయకులు చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ ఎంత విరుచుకుపడినా ఫలితం శూన్యమేనని గ్రహించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ మాట్లాడుతూ చంద్రబాబు మాటలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మత్స్యకార డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలనలో సంక్షేమ పథకాలతో ఎంతో మంది లబ్ధి పొందారన్నారు. బొల్లవరపు జాన్‌వెస్లీ, ద్రోణంరాజు శ్రీవత్సవ్ మాట్లాడుతూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో పార్టీ విశాఖ జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్, కనకమహాలక్ష్మి ట్రస్ట్‌బోర్డు చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, కార్పొరేటర్లు బిపిన్‌కుమార్ జైన్, కోడూరు అప్పలరత్నం, తోట పద్మావతి, విల్లూరి భాస్కరరావు, వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, పీతల వాసు, దశమంతుల మాణిక్యాలరావు, మాసిపోగు రాజు, మూలే రామిరెడ్డి, అలపున కనకరెడ్డి, నాయకులు సబీరా బేగం, మహ్మద్ షరీఫ్, బోని దేవా, లింగం శ్రీనివాస్, బొడ్డేడ ప్రసాద్, బోరా శ్రీనివాసరెడ్డి, బెహర వెంకటరత్నం, ముజీబ్‌ఖాన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట అర్చకులు పూజ నిర్వహిస్తారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలని ఆలయ అధికారులు కోరారు.

నీలమ్మ వేపచెట్టు అమ్మవారి సన్నిధిలో సింధూ మాతాజీ



నీలమ్మవేపచెట్టు అమ్మవారిని దర్శించుకున్న సింధూ మాతాజీ

అల్లిపురం: భద్రకాళీ పీఠాధిపతి(గచ్చిబౌలి) సింధూ మాతాజీ సోమవారం అప్సాంగార్డెన్స్‌లో వెలసిన శ్రీనీలమ్మవేపచెట్టు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా విజయలక్ష్మి స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ బి.శ్రీనివాసరెడ్డి, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



శిథిలావస్థకు చేరిన మత్స్యకారుల షెల్టర్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జానకీరామ్

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 37వ వార్డులో అభివృద్ధి పనులకు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా జీవీఎంసీ అధికారులతో ప్రణాళికలు రూపొందించారు. రోడ్లు, డ్రెయిన్లు, భూగర్భ డ్రైనేజీ పనులతోపాటు బీచ్‌రోడ్డు గాంధీ బొమ్మ, షెల్టర్ ఆధునికీకరణ, సామాజిక భవనాలకు సంబంధించి రూ.1.5 కోట్లతో పనులు చేపట్టేందుకు సోమవారం అంచనాలు రూపొందించినట్టు జానకీరామ్ తెలిపారు. అభివృద్ధి పనుల అంచనాలను మేయర్ హరి వెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్ వర్మ దృష్టికి తీసుకెళ్లనున్నట్టు చెప్పారు. వార్డులో జీవీఎంసీ అధికారులతో పర్యటించి అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

రెజ్లర్లపై దాడికి నిరసనగా మహిళా సంఘాల ర్యాలీ



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మహిళా సంఘాల సభ్యులు

సీతమ్మధార : మహిళా రెజ్లర్లపై ఢిల్లీలో పోలీసులు పైశాచికంగా జరిపిన దాడిని నిరసిస్తూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్ సింగ్ హోటల్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ, భారత్ రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. నూతన పార్లమెంట్ భవనం ఎదుట నిరసనకు యత్నించిన రెజ్లర్లపై పోలీసులు విరుచుకుపడడం సరికాదన్నారు. బి.పద్మ, ఆర్‌కేఎస్ కుమార్, బి.రమణి, వి.కృష్ణారావు, ఎం.రాంబాబు పాల్గొన్నారు.

ఇండో నేపాల్ కరాటేలో ప్రతిభ



పతకాలు సాధించిన కరాటే వెపన్స్ కాటా పిల్లలు

దాబాగార్డెన్స్: స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఇండో నేపాల్ కరాటే పోటీల్లో నగరానికి చెందిన కరాటే వెపన్స్ కాటా పిల్లలు ప్రతిభ సాధించారు. పలు విభాగాల్లో జరిగిన పోటీల్లో అల్లిపిల్లి లక్ష్మీనారాయణ(బంగారం), కొయ్య లోకేష్(రజతం), శ్రీరామ్ ఉదయ్ ఈశ్వర్ (కాంస్యం), అల్లిపిల్లి శ్రీమన్నారాయణ(రజతం), కె.కుశ్వంత్‌కుమార్(బంగారం), వినయ్ ఈశ్వర్ (కాంస్యం), కోళ్ల అజయ్(కాంస్యం), కౌతరపు భార్గవ్(కాంస్యం), గుసిడి సాయిబాలాజీ(కాంస్యం), దొరసింగి తనీష్(వెండి), గుజ్జు వరుణ్‌తేజ్(కాంస్యం), గుడె అంకిత్(బంగారం), డొక్కర జ్యోత్స్నవి సాయి(వెండి), గుసిడి కార్తీక(వెండి), కోళ్ల శరణ్య(వెండి), వాసుపల్లి దివ్య అంజలి(బంగారం), కౌతరపు యస్విని(కాంస్యం), రాఘని హునార్(బంగారం), జక్కా షణ్ముఖ ప్రియ(బంగారం), ఎం కేశవ హర్షిత సాయి(బంగారం), రాగణి వరుణ్(కాంస్యం), ఎం.హవిష సాయి(కాంస్యం), దామోదర భువనేష్(కాంస్యం), పీతల ఉజ్వల్(కాంస్యం), ఉమ్మిడి అశ్వినీకుమార్(బంగారం), వంకా రాజు(వెండి), ఎం.కార్తికేయన్(బంగారం) పతకాలు సాధించారని కోచ్ శ్రీనివాసరావు తెలిపారు. పతకాలు సాధించిన వారిని సోమవారం అభినందించారు.

రైల్వే స్కూల్‌ను తొలగించొద్దు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పూర్వ విద్యార్థులు, విద్యా కమిటీ సభ్యులు

మహారాణిపేట: రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల(రైల్వే స్కూల్) తొలగింపు నిర్ణయానికి వ్యతిరేకంగా స్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. 430 మంది విద్యార్థులతో ఈ పాఠశాల అభివృద్ధి పథంలో నడుస్తోందని, నాడు-నేడు కింద ప్రభుత్వం అనేక ఆధునికీకరణ పనులు చేపట్టిందని పూర్వ విద్యార్థులు తెలిపారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా రూపుదిద్దుకుంటున్న రైల్వే పాఠశాలను మూసి వేస్తామని రైల్వే అధికారులు చెప్పడం బాధాకరమని పూర్వ విద్యార్థి కొత్తపల్లి వెంకటరమణ అన్నారు. ఈ నెల 3న ఇచ్చిన నోటీసులో వారం రోజుల్లో ఖాళీ చేయాలని ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలన చేయాలని ఆయన కోరారు.

ఆంక్షలు లేకుండా ఉపాధి కల్పించాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మాట్లాడుతున్న నాయకులు

సీతమ్మధార : గతంలో స్కూటినీ కమిటీ ఎంపిక చేసిన 316 మంది డెత్, రిటైర్డ్, దీర్ఘకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కార్మికుల బిడ్డలకు ఆంక్షలు లేకుండా ఉపాధి కల్పించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి కోరారు. ఈ మేరకు జీవీఎంసీలో ఖాళీగా ఉన్న 482 పోస్టులు పారిశుద్ధ్య కార్మికుల బిడ్డలకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ప్రధాన కార్యాలయం వరకు సోమవారం ప్రదర్శన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాయింట్ లేబర్ కమిషనర్ ఉత్తర్వులు, రాష్ట్ర ప్రభుత్వ జీవో - 7 ప్రకారం రూ.18,500 వేతనం చెల్లించాలని, ఆప్కాస్‌లో క్లాప్ డ్రైవర్లను విలీనం చేయాలని డిమాండ్ చేశారు. చెత్త తరలించే డ్రైవర్లు, యూజీడీ కార్మికులు, మలేరియా, వెటర్నరీ విభాగ కార్మికులకు హెల్త్ అలవెన్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. జూన్ 18లోగా అన్ని సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధమవుతామన్నారు. నూకరాజు, యు.రాజు, ఎం.సూరీడు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌కి గనులు కేటాయించాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్ష చేస్తున్న మహిళా సంఘాల నాయకులు

సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయించాలని, ప్రైవేటీకరణకు ఒప్పుకోమని ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి అన్నారు. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేస్తున్న దీక్షలు 788వ రోజుకు చేరుకున్నాయి. దీక్షకు ఐద్వా విశాఖ జిల్లా కమిటీ సభ్యులు సోమవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రం తీసుకున్న నిర్ణయం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల సంపదైన ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే చర్యలు వీడకపోతే మోడీ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఎ.పుష్పాంజలి సాహు, కె.లక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి దుర్మరణం

ఎన్నార్ల క్యాంపస్ : ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోగా మరొకరు క్షేమంగా బయటపడ్డారు. అల్లినగరం జంక్షన్ వద్ద సోమవారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనలో విశాఖ అర్బన్‌కు చెందిన రాపర్తి వెంకటసత్య రాఘవేంద్ర (39) ప్రాణాలు కోల్పోయినట్టు పోలీసులు తెలిపారు. వెంకటసత్య రాఘవేంద్రతో పాటు మరో వ్యక్తి శ్రీకాకుళంలో జరిగిన ఓ ఫంక్షన్‌లో వంటలు చేసిన తరువాత తిరిగి ద్విచక్ర వాహనంపై విశాఖకు వెళ్తున్నారు. అల్లినగరం జంక్షన్ వద్ద వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో వెంకటసత్య రాఘవేంద్ర అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. వెనుక కూర్చున్న వ్యక్తి క్షేమంగా బయటపడ్డారు. ఆధార్ కార్డు, వెనుక కూర్చున్న వ్యక్తి సమాచారం మేరకు కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఎస్సై వి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగులు

మహారాణిపేట : ఆర్టీసీలో పనిచేసి రిటైర్ అయిన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ విశాఖ రీజియన్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.భానుబాబు డిమాండ్ చేశారు. డిపోల్లో డ్రైవర్, కండక్టర్, మెకానిక్, హెల్పర్‌గా పనిచేసి రిటైర్ అయ్యామని, తాము వివిధ సమస్యలతో సతమతమౌతున్నామని, వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. గ్రాట్యుటీ, సరెండర్ లీవ్ సెటిల్‌మెంట్ చేయాలని, ఈపీఎఫ్ పెన్షన్ చాలా మందికి రావడం లేదని, రిటైర్ అయిన వారందరికీ పింఛను ఇవ్వాలని కోరారు. వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు సమర్పించారు.

పంచాయతీ పారిశుధ్య కార్మికుల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న పంచాయతీ పారిశుధ్య కార్మికులు

మహారాణిపేట: జిల్లాలోని పంచాయతీల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ గ్రామ పంచాయతీ శానిటరీ వర్కర్స్ యూనియన్ జిల్లా శాఖ(ఏఐయూటీయూసీ) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బకాయి జీతాలు చెల్లించాలని, అసంఘటిత కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, గుర్తింపు కార్డులు అందించాలని, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధి వలంటీర్లు



సేవా పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్

మహారాణిపేట: జీవీఎంసీ 30వ వార్డు తాడి వీధి కమ్యూనిటీ హాల్‌లో కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం ఆధ్వర్యంలో సోమవారం వలంటీర్లకు సేవా పురస్కారాలు ప్రదానం చేశారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి వలంటీర్ వ్యవస్థ అని చెప్పారు. నిరుపేదలకు తక్షణ సహాయం అందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారని కొనియాడారు. వార్డులో ఉన్న 5 సచివాలయాల్లో పని చేస్తున్న 80 మంది వలంటీర్లకు సేవా మిత్ర, వలంటీర్ కనకమహాలక్ష్మికి సేవా రత్న, హేమలతకు సేవా వజ్ర, పెంకి ప్రవీణ్‌కుమార్‌కు సేవా వజ్ర పురస్కారాల ప్రదానం చేశారు. వారికి శాలువా కప్పి అవార్డు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ పుణ్యవతి, పార్టీ నాయకుడు పెంటపల్లి సత్యనారాయణ, వార్డు అధ్యక్షుడు దశమంతుల మాణిక్యాలరావు, సౌత్ మైనారిటీ సెల్ ప్రెసిడెంట్ ముజీబ్‌ఖాన్, దశమంతుల చిన్ని, వడ్డాది దిలీప్, అప్పలరాజు, రాము, వెంకట్, వేణు, డేవిడ్, రామరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజన్న ఆటోనగర్ పనులు ప్రారంభించాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

మహారాణిపేట : ఆనందపురం మండలం కణమాం గ్రామంలో రాజన్న ఆటోనగర్ పేరుతో నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఆటో పార్ట్స్, స్క్రాప్ కార్మికుల (సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. కాలం చెల్లిన వాహనాల విడిభాగాలు తిరిగి ఉపయోగంలోకి తీసుకురావడం, అమ్మకాలు వృత్తిగా పది వేల మంది కార్మికులు జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ కార్మికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఆనందపురం మండలం కణమాం గ్రామంలో 150.77 ఎకరాల భూమిని మంజూరు చేసిందన్నారు. ఈ కాలనీకి రాజన్న ఆటోనగర్ అని పేరు కూడా పెట్టారన్నారు. ఈ నిర్మాణ పనులను ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ)కి అప్పగించారని, నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కార్యాలయం ఆదేశాలను కూడా అధికారులు అమలు చేయడం లేదని యూనియన్ జాయింట్ కలెక్టర్ కె.గణేష్ వాపోయారు. దీనిపై కలెక్టర్ చొరవ తీసుకుని నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు.

ఘనంగా కొత్తమ్మవారి తొలేళ్ల పండగ



అల్లిపురంలో అమ్మవారి పూలఘటాలతో తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు



విశేష అలంకరణలో కొత్తమ్మవారు

అల్లిపురం: భక్తుల కొంగు బంగారం, అల్లిపురం అమ్మవారివీధి వాసుల ఆరాధ్య దైవం కొత్తమ్మవారి నెల పండగలో భాగంగా సోమవారం తొలేళ్ల సంబరం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి విశేష పూజలు చేశారు. పసుపు, కుంకుమతో విశేష పూజలు నిర్వహించి అలంకరించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ఊంజల సేవ నిర్వహించారు. అమ్మవారిని స్తుతిస్తూ మహిళలు పాటలు పాడారు. అల్లిపురం మెయిన్ రోడ్డు, వివేకానందనగర్, కుమ్మరవీధి, పూతివారి మాన్యం, నీలమ్మవేపచెట్టు ప్రాంతాల్లో సాముగరిడీలు, డప్పు వాయిద్యాల మధ్య అమ్మవారి పూలఘటాలు తిరువీధి ఉత్సవం కనుల పండువగా సాగింది. రాత్రి 10 నుంచి 12 గంటల వరకు అల్లిపురంలోని వీధుల్లో వరినాట్లు నాటారు. రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. పండగ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. సాయంత్రం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కొత్తమ్మవారి ప్రధాన ఉత్సవం మంగళవారం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట పాత్రికేయుల ఆందోళన


మహారాణిపేట: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల(ప్రభుత్వ గుర్తింపు పొందిన) అసోసియేషన్ల సభ్యులు ఆందోళనకు దిగారు. సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయం సమీపంలో ఉన్న డీపీఆర్‌వో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అక్కడ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, అర్బన్ అధ్యక్షుడు పి.నారాయణ, ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఇరోతి ఈశ్వరరావు, ఇతర నాయకులు సాంబశివరావు, బి.సీతారామ్మూర్తి, మధు,వై.రామకృష్ణ, ఎన్.రామకృష్ణ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక శోభ

- నేటి నుంచి కల్యాణ మహోత్సవాలు
- 'దక్షిణ'లో ముస్తాబైన ఆలయాలు



అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయం



సత్యనారాయణస్వామి ఆలయం

దాబాగార్డెన్స్: విశాఖ దక్షిణ నియోజకవర్గం మంగళవారం నుంచి వారం రోజుల పాటు ఆధ్యాత్మిక శోభతో కళకళలాడనుంది. ప్రతి ఏటా జ్యేష్ఠ శుద్ధమి రోజున పలు ఆలయాల వార్షికోత్సవాలు నిర్వహించుకోవడం ఆనవాయితీ. దీనిలో భాగంగా ఇసుక కొండ(బాబాజీకొండ)పై కొలువైన శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి వార్షిక దివ్య కల్యాణోత్సవాలు ఈ నెల 30 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు జరగనున్నాయి.

- పోర్టు ఏరియా శృంగమణి పర్వతంపై వెలసిన వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణ మహోత్సవాలు ఈ నెల 30 నుంచి జూన్ 5వ తేదీ వరకు నిర్వహించనున్నారు.
- స్వామి కల్యాణంలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించాలి.
- సూర్యాబాగ్ మెయిన్ రోడ్డులో ఉన్న విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 31వ తేదీ నుంచి వార్షిక కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నారు.
- అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఈ నెల 30 నుంచి జూన్ 4వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. స్వామి కల్యాణంలో పాల్గొనదలిచే భక్తులు రూ.300 చెల్లించాల్సి ఉంటుంది.

రూ.50 కోట్లతో పరిశోధన కేంద్రాలు

కొమ్మాది: శాస్త్ర పరిశోధనలు బలోపేతం చేయడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం రూ.50 కోట్లతో పరిశోధన కేంద్రాలను అభివృద్ధి చేస్తుందని వీసీ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం తెలిపారు. గీతం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కేంద్రం ఆధ్వర్యంలో నూతన అధ్యాపకులకు అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధనతోపాటు పరిశోధనల్లో విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిలపడానికి ప్రణాళికాయుతంగా కృషి చేస్తున్నామని తెలిపారు. బోధనా పద్ధతులు మార్చుకోవాలని సూచించారు.